# డయాస్పోరా

శ్రీశ్రీ ఆకలేసి కేకలేస్తే, ముళ్ళపూడి వెంకటరమణ ఆకలేసి జోకులేశారు.

ఇదెందుకు వ్రాశానంటే, మన తెలుగు సాహిత్యం ఎంత విస్తృతమైనదో చూపిద్దామని. వివిధరంగాలలోనే కాదు, సరిహద్దులు దాటి ఇతర దేశాలకి కూడా వెళ్ళింది. ఇక్కడే మొట్టమొదటిసారిగా ఈ డయాస్పోరా సాహిత్యం అనే మాట విన్నాను. డయాస్పోరా ఒక్క సాహిత్యానికే సంబంధించింది కాదు.

ఈ పుస్తకంలోని నలభై కథల్లోనూ, కొన్నే స్త్రీవాద కథలు, కొన్నే దళిత కథలు, మరెన్నో రాయలసీమ కథలు, ఇన్ని మాత్రమే తెలంగాణా కథలు, కొన్ని ఇంకేవో కథలు అని కోటా సిద్ధాంతం ప్రకారం సమీక్షలువ్రాశే కోటా శ్రీనివాసులు ఇంకా వారి సూత్రుల్లోనే కూర్చుని వెకిలిస్తున్న తెలుగు సాహిత్యంలో, ఈ డయాస్పోరా మీద కూడా మన ఆంధ్రదేశంలోనే రీసెర్చి జరుగుతున్నదని తెలిసి సంతోషించిన వాళ్ళల్లో నేనూ ఒకడిని. ఈ విషయం గురించి వివరంగా వ్రాస్తాను. ముందుగా డయాస్పోరా అంటే ఏమిటో తెలుసుకోవటం ముఖ్యం.

ఈమధ్య ఏం చదువుతున్నా పుస్తకాలు కానియ్యండి వార్తలు కానీయుండి, పంటిక్రింద రాయిలా డయాస్పోరా అనే మాట మాటిమాటికీ అడ్డం వస్తూనే వుంది. అసలదేమిటో అర్థం చేసుకుందామని నేను కొన్ని పుస్తకాల్లోనూ, ఇంటర్నెట్‌లోనూ, ముఖాముఖీ సమావేశాల్లోనూ సేకరించిన సమాచారం చాలవుంది. వాంట్లో మనకి అవసరమైనంతవరకూ ఇక్కడ చెప్పుకుందాం.

అసలు డయాస్పోరా అనేది ఒక గ్రీకు మాట. దానికి అర్థం తమ ప్రదేశం లేక సంస్కృతులని వదిలి బయటికి వెళ్ళినవారని అర్థం. మన భాషలో వలస వెళ్ళినవారు అని చెప్పుకోవచ్చునేమో. ఇది బహుశా జ్యూయిష్ మతంవారు, బాబిలోనియన్ సంస్కృతినించి బయటికివచ్చినప్పుడు వాడిన పదం అయివుండవచ్చు. మరి ఆనాడే ఆ పదం వాడుకలో వుంటే, ఈనాటి దాకా మన దగ్గిరికి ఎందుకు రాలేదు అనేది ఒక ప్రశ్న. ఇండియా ప్రభుత్వం కూడా ఈ మధ్యనే డయాస్పోరా అనే పదాన్ని వాడటం ప్రారంభించటానికి కారణాలు ఏమిటనేది ఇంకొక ప్రశ్న. చూద్దాం వీటికి జవాబులు దొరుకుతాయేమో!

భారతదేశంనించీ 2300 సంవత్సరాల క్రితమే ప్రజలు దేశంవదిలి బయటికి వలస వెళ్ళటం మొదలుపెట్టారని అంచనా. అంటే క్రీస్తు పూర్వమే శ్రీలంక, ఆఫ్గనిస్థాన్‌లాటి దేశాలకి మనవాళ్ళు వెళ్ళినట్టు దాఖలాలున్నాయి. తర్వాత

7 – 8 శతాబ్దాల్లో తూర్పు ఆఫ్రికాలాంటి దేశాలకి మనవాళ్ళు పనివాళ్ళుగా (బానిసలుగా అంటున్నారు కానీ, నాకా పదం వాడటం ఇష్టం లేదు) వెళ్ళారని, దాని కారణంగా గుజరాతీ వ్యాపారులు అరబ్బులకి పెట్టుబడి పెట్టి ఈ వ్యాపారంలో లాభాలు గడించారనీ తెలుస్తున్నది. తర్వాత బ్రిటిష్‌వారు మన దేశాన్ని ఆక్రమణ చేశాక, వాళ్ళకి రకరకాల పనులు చేసిపెట్టటానికి, ఫిజి, వెస్ట్ ఇండీస్, దక్షిణ ఆఫ్రికా, తూర్పు ఆఫ్రికా, మారిషస్, గయానా, సూరినం, మలేషియా మొదలైన దేశాలకి తీసుకువెళ్ళారు. రెండు ప్రపంచ యుద్ధాలలోనూ కలిసి రెండు మిలియన్ల భారతీయులు బ్రిటిష్‌రాజ్యం తరపున పోరాడారు. వారిలో చాలమంది ఏ దేశంలో ఆయుద్ధం చేశారో ఆ దేశాన్నే తమ దేశంగా భావించి అక్కడే వుండిపోయారుట. 19–20వ శతాబ్దాలలో వ్యాపార నిమిత్తం ఉగాండా కెన్యాలాటి దేశాలకీ, ఉద్యోగనిమిత్తం గల్ఫ్ దేశాలకీ ఎక్కువగా వెళ్ళారు. రెండవ ప్రపంచ యుద్ధం అయిన తర్వాత, యూరప్‌లోని దేశాలకీ, కెనడా అమెరికా ఆస్ట్రేలియాలాటి దేశాలకీ ఎక్కువమంది వెళ్ళినట్టు తెలుస్తున్నది. ఈనాడు దాదాపు ఇరవై మిలియన్ల భారతీయులు (రెండు కోట్లు) విదేశాల్లో వున్నారు. 11 విదేశాల్లో ఒక్కొక్క దేశంలోనూ పది లక్షల పైన, 22 విదేశాల్లో కనీసం లక్షమందీ చొప్పున వున్నారుట.

ఇక్కడ అడగవలసిన ప్రశ్నలేమిటంటే– ఒక దేశాన్ని వదిలి వెళ్ళిపోయి తమ బాగు చూసుకుంటున్న వీరి గురించి, వారి దేశీయులు పట్టించుకోవాల్సిన అవసరంవుందా? ఈ వలస వెళ్ళినవారిలో భారతీయత ఎంతవరకూ మిగిలివుంది. వీళ్ళవల్ల ఇండియాకి లాభం ఏమన్నా వుందా? భారతదేశం వల్ల వీరికి ఏమైనా లాభం వుందా?

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, నెహ్రూగారు విదేశాల్లో వున్న భారతీయుల గురించి ఆలోచించారు కానీ, రాజకీయ కారణాల వల్ల ఏమీ నిర్ణయాలు తీసుకోలేదుట. తర్వాత ఏ రాజకీయనాయకులూ పట్టించుకోలేదు. 1977లో జనతా గవర్నమెంట్ వచ్చాక మొరార్జీ దేశాయ్ చరణ్‌సింగ్, ఫెర్నాండెజ్‌ల నాయకత్వంలో, అప్పటి దాకా కాస్తో కూస్తో బయట ప్రపంచంలో ఇండియాకి వున్న పేరూ, అవగాహనా తుడిచిపెట్టుకుపోయాయి. ప్రపంచీకరణంలో చైనా తైవాన్ కొరియా మలేషియాలాటి దేశాలు ఆర్థికంగా ముందుకి దూసుకుపోతుంటే, భారత రాజకీయ నాయకులకి కనువిప్పు కలిగింది. అప్పుడే భారత ఆర్థిక పరిస్థితి కూడా మందగించింది. విదేశీ ద్రవ్య నిలువలు నిండుకున్నాయి. ప్రపంచ బ్యాంకు అప్పులు ఆకాశాన్నందుకున్నాయి. నరసింహారావ్, మన్‌మోహన్ సింగ్, చిదంబరం ఇక లాభంలేదని ముందుకు అడుగులు వేశారు. అప్పుడే ఎన్నారైలు గుర్తుకి వచ్చారు. దాంతో భారతదేశ ఆర్థిక పరిస్థితి మళ్ళీ మెరుగయింది. ఎన్నో కొత్తకొత్త పరిశ్రమలు వచ్చాయి. విదేశీ ద్రవ్య నిలువలు ఆకాశాన్నంటుకున్నాయి. అంతేకాదు, ఆనాడు జనతా పార్టీలో వుండి ఇవన్నీ కాదన్న నాయకులుకూడా ఈనాడు ఏ ఎండకా గొడుగు పట్టేస్తున్నారు. పోయిన సంవత్సరం భారత ప్రభుత్వం వంద మిలియన్ల రూపాయలు ఖర్చుపెట్టి ఇండియాలో

డయాస్పోరా కాన్ఫరెన్స్‌ని నిర్వహించింది.

ప్రపంచీకరణలో డయాస్పోరా ఎంతవరకూ ఎలా ఉపయోగపడుతున్నదో, తర్వాత వ్యాసాల్లో చూద్దాం. ఇప్పుడు ఈ డయాస్పోరా మీద ఎంత రీసెర్చి జరుగుతున్నదో, ముఖ్యంగా తెలుగులో రీసెర్చి... చెప్పుకుందాం.

కొన్నేళ్ళక్రితం మామూలుగా ఈమైల్ చూసుకుంటుంటే ఎవరో అపరిచిత వ్యక్తి దగ్గరనించి ఒక ఈమైల్ నన్ను ఆకర్షించింది. ఆయన వేరే దేశాల్లో వున్న ఇండియన్స్, ముఖ్యంగా తెలుగువాళ్ళు, వారి సంస్కృతి, సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు పాఠశాలలు, విదేశాల్లో పెళ్ళిళ్ళు మొదలైన విషయాల మీద తను పి.హెచ్.డి. రీసెర్చి చేస్తున్నానని, దానికి నాలాటి ఎన్నారైల సహాయం కావాలనీ వ్రాశారు. నేను వ్రాసే కథలు కూడా అలాటి విషయాల మీదే కనుక, నాకు ఆయనకి అవసరమైన సమాచారం ఇవ్వాలనే ఉత్సాహం కలిగింది. అప్పటినించీ అమెరికానించీ నేనూ, నాలాటి వారు ఇంకా కొంతమందీ, అలాగే మలేషియా, మారిషస్, ఆస్ట్రేలియాలాటి దేశాలనించీ ఎంతోమంది ఆయనకు సహకారం అందించారు. ఈమధ్య ఇండియా వెళ్ళినప్పుడు ఆయన్ని కలిశాను కూడాను. ఆయన పి.హెచ్.డి. థీసిస్ పూర్తయిందని చెప్పారు. ఆయన దగ్గర పర్మిషన్ తీసుకోలేదు కనుక ఆయన పేరు ఇక్కడ చెప్పటంలేదు. కాకపోతే ఆయనకో వెబ్‌సైట్ వుంది. అది పబ్లిక్ సమాచారమే కాబట్టి మీరు అక్కడికి వెళ్ళి ఆయన చేసిన రీసెర్చి ఫలితాలు చూడవచ్చు. www.telugudiaspora.com అనే వెబ్ సైట్‌కి వెడితే మీకు చాలా సమాచారం దొరుకుతుంది.

ఆమధ్య డెట్రాయిట్‌లో జరిగిన మూడవ అమెరికా తెలుగు సాహిత్య సదస్సులో కూడా సాహిత్యపరంగా డయాస్పోరా గురించి చర్చలు జరిగాయి. తర్వాత కూడా ఎన్నో చోట్ల ఈ మాట వినిపిస్తూనే వుంది. కొన్ని చర్చల్లో చెప్పేవాళ్ళు చెవులు ఇంట్లో పెట్టేసి సభలకి వస్తారు కనుక, వాళ్ళు చెప్పేది చెప్పేసి, మీరు చెప్పేది నేను వినను అని భోజన సమయందాకా వినకుండా కూర్చుని, భోజనాలయాక ఒక కునుకు తీస్తారు. అలాటి చోట్ల చక్కటి చర్చలు జరగటం కొత్త విషయాలు తెలుసుకోటం జరగవు. ఇంటర్నెట్‌లోనూ అంతే! నేను చెప్పింది రైట్. మీరు చెప్పేది తప్పని. అందుకే ఇలాటి రీసెర్చి చూసినప్పుడూ అన్ని కోణాలలోనించీ చక్కగా పరిశీలన కనపడ్డప్పుడూ తృప్తిగా వుంటుంది.

నన్ను ఎవరో అడిగారు, మీరు డయాస్పోరా సాహిత్యం వ్రాస్తారు కదూ అని. మీ అమెరికాబేతాళుడి కథలూ, ఎన్నారై కథలూ, మేడిన్ అమెరికా కథలూ, చీకటిలో చందమామ నవలా... ఇలా చెప్పుకుంటూ పోయాడాయన. నేను డయాస్పోరా సాహిత్యం వ్రాస్తానని నాకూ తెలీదు. నా చుట్టూ జరిగేవి వ్రాయటం నా అలవాటు. అప్పుడే అనిపించింది - అవును. నేనూ తెలుగు దేశం వదిలి వలస వచ్చిన వాడినే కదా. మరి నేను వ్రాసేది డయాస్పోరా సాహిత్యం కాక మరేమిటి అని.

* * *